# Eenadu

# పట్టణీకరణతో మెరుగైన ఉద్యోగావకాశాలు

- వనరులు సద్వినియోగం చేసుకోవాలి
- అంతర్జాతీయ ఆర్థిక పరిశోధన భారత సంచాలకుడు కతూరియా



పట్టణీకరణతో ఉద్యోగావకాశాలు పెరగడంతో పాటు, సేవా రంగం అభివృద్ధి చెందుతుందని అంతర్జాతీయ ఆర్థిక పరిశోధన భారత విభాగ సంచాలకుడు డాక్టర్ రజత్ కతూరియా అభిప్రాయపడ్డారు. బ్రిక్స్ సదస్సులో భాగంగా గురువారం 'పట్టణ మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం' అన్న అంశంపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన మాట్లాడుతూ పట్టణీకరణ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వాలు బలోపేతం కావాల్సి ఉందని అన్నారు. వనరుల సద్వినియోగం, సేవలు అందించడంలో సూరత్, పూణే నగరాలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని చెప్పారు. చైనా నిర్మాణ, సాంకేతిక విజ్ఞాన విభాగ ప్రధాన ఇంజినీర్ జూ హయున్ మాట్లాడుతూ పట్టణీకరణ కార్యకలాపాల కోసం ఇంతవరకు బ్యాంకులపై ఆధారడ్డామని చెప్పారు. బ్యాంకులు తాజాగా ఆంక్షలు విధిస్తుండడంతో స్థానిక సంస్థలు కార్పొరేట్ బాండ్లు విడుదల చేస్తూ నిధులు సమకూర్చుకుంటున్నాయని తెలిపారు. ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు నిర్మించు-నిర్వహించు-బదిలీ చేయు విధానంతో పలు ప్రాజెక్టుల పనులు చేపడుతున్నాయన్నారు. దక్షిణాఫ్రికా కేప్‌టౌన్ పురపాలక సంఘ విశ్రాంత ప్రధాన ఆర్థికాధికారి ఫిలిప్ వాన్ రెనెవెల్డ్ మాట్లాడుతూ అపారిశుద్ధ్యం, అనుత్పాదక రంగాలు సమస్యాత్మకంగా మారాయని తెలిపారు. బ్రెజిల్ దేశ నగరాల అభివృద్ధి మాజీ మంత్రి ఇనిస్ డ మగల్‌హేస్ మాట్లాడుతూ సామాజిక అంతరాలు తగ్గించి, పట్టణ జీవనం మెరుగుపడేలా పలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాలు, యాజమాన్య సంస్థ ప్రధాన కార్యనిర్వాహకాధికారి ప్రకాశ్ గౌర్ ప్రసంగిస్తూ అందుబాటులో ఉన్న వనరులను స్థానిక సంస్థలు వినియోగించుకోవాలని సూచించారు. క్రిసిల్ మౌలిక సదుపాయాల, సలహా సంస్థ సంచాలకుడు బ్రిజ్‌గోపాల్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు ప్రభుత్వ సాయంపై ఆధారపడుతున్నాయని, నిర్వహణ ఖర్చులు భారంగా మారాయని చెప్పారు. ఓఈసీడీ ప్రజా పరిపాలన, ప్రాదేశిక అభివృద్ధి డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ లూయిస్ డి మెల్లో అధ్యక్షత వహించారు.